
కాఫీ రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

సికిల్‌సెల్ ఎనీమియా బాధిత చిన్నారుల కుటుంబాన్ని పరామర్శిస్తూ..

గిరిజనులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎంత దూరంలో ఉన్నా.. మీ చెంతనే వైద్యం

సంజీవనితో అందరికీ ఆరోగ్య సేవలు

జీవో నం.3కు ప్రత్యామ్నాయం తీసుకొస్తాం

గన్నెల సభలో సీఎం చంద్రబాబు

సభకు హాజరైన గిరిజనులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, అరకులోయ/పట్టణం, డుంబ్రిగుడ:

"గిరిజన ప్రాంతంలో మీరంతా ఎంత దూరంలో ఉన్నా.. వైద్యులు, సిబ్బంది మీ వద్దకు రావాలి. మంచి వైద్యం అందించాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి. అందుకే 'సంజీవని' తెచ్చాం. ఆదివాసీల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అరకులోయ మండలం గన్నెలలో సంజీవని పథకం పైలట్ ప్రాజెక్టు అమలులో భాగంగా ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం స్థానికులతో ముఖాముఖి మాట్లాడారు. ఆరోగ్య రథాలకు జెండా ఊపారు.

▲ 'మన్యంలో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే మా ఆలోచన. ఇక్కడ ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీవో నంబరు 3 మేమే తీసుకొచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సరిగా వాదించకపోవడంతో సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకొస్తాం'.

▲ పాపులేషన్ మేనేజ్‌మెంట్‌లోనూ గిరిజనులు ముందున్నారు. పిల్లలే మన సంపద అనే సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నారు. 2014లో విశాఖ జిల్లాలో ఏర్పాటుచేసిన మెడ్‌టెక్ జోన్ ఇప్పుడు ప్రపంచస్థాయి వైద్యపరికరాలు తయారు చేస్తోంది. మెడ్‌టెక్ జోన్ ఉత్పత్తులు అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ద్వారా ప్రపంచానికి ఎగుమతి అవుతాయి. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు ఇచ్చే జన ఔషధి కేంద్రాలను ప్రారంభిస్తాం. 104 సర్వీసు ద్వారా మీ ఇంటి దగ్గరే 42 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తారన్నారు.

ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రులు సత్యకుమార్, సంధ్యారాణి, కలెక్టర్ నిశాంతి, జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, దొన్నుదొర తదితరులు

▲ అరకు ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు హోంస్టే ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువతకు ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం. వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలన్నదే లక్ష్యం. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్ లైన్ నెట్‌వర్క్ ఉంది. రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నాం. సికిల్‌సెల్, తలసీమియా బాధితులకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్ ఇస్తున్నాం. గిరిజన బిడ్డలు దేశంలో అత్యున్నత విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఐఐటీ మద్రాసుతో ఒప్పందం చేసుకున్నాం. గిరిజన రైతుల తమ ఉత్పత్తులు ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

డ్రోన్ పనితీరును పరిశీలిస్తూ..

మూడు నెలల్లో సెల్ టవర్లు: జిల్లాలో రోడ్లు, సెల్‌ఫోన్ల సిగ్నల్ కనెక్టివిటీ తక్కువగా ఉంది. ఇప్పుడంతా మొబైల్ ఫోన్ ద్వారానే సేవలన్నీ అందుతున్నాయి. వచ్చే మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా సెల్ టవర్లు నిర్మిస్తాం. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదన్నదే నా సంకల్పం. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. గిరిజనులతోపాటు రాష్ట్రంలోని ప్రతి పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

మన్యంపై సీఎంకు ప్రత్యేక అభిమానం

మన్యం ప్రాంతంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రత్యేక అభిమానం ఉంది. అరకు కాఫీ ఖ్యాతిని కూటమి ప్రభుత్వం విశ్వవ్యాప్తం చేసింది. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం.. రాష్ట్రానికి 10032 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను మంజూరు చేస్తే.. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో 3100 మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్‌మిషన్, 15వ ఆర్థిక సంఘం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య నిధులతో రూ.1200 కోట్లతో 4500 ఆరోగ్య మందిరాల నిర్మాణం వేగవంతం చేశాం. ఇందులో రూ.230 కోట్లు గిరిజన ప్రాంతానికే కేటాయించాం. అరకు పార్లమెంటు పరిధిలో 435 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, 28 ల్యాబ్‌లు, 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో పాడేరు వైద్య కళాశాల నిర్మాణానికి కేంద్ర నిధులను మాత్రమే ఖర్చుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర నిధులను కేటాయించి నిర్మాణం పూర్తిచేస్తున్నాం. రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా.. ఇంటివద్దకే వైద్య సేవలు, ఫోన్ల ద్వారా ఆరోగ్య సలహాలు, వైద్యం, మందుల పంపిణీ జరుగుతోంది. ఆరోగ్య ఆంధ్ర నిర్మాణం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.

– సత్యకుమార్‌యాదవ్, వైద్యారోగ్య శాఖ మంత్రి

సీఎం పర్యటన సాగిందిలా..

» **10.37:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో అరకులోయ మండలం గన్నెల చేరుకున్నారు.

» **10.47:** ముఖ్యమంత్రికి మంత్రులు, స్థానిక నాయకుల స్వాగతం.

» **11.00:** గన్నెల గ్రామ స్వాగత ద్వారం వద్ద 104 ఆరోగ్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. » **11.00-11.20:** గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన.

» **11.30:** రామకృష్ణనగర్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి. » **11.30 - 12.05:** రామకృష్ణ నగర్‌లో గిరిజనులతో మాటామంతి.

» **12.15:** రామకృష్ణ నగర్ నుంచి గన్నెలలో బహిరంగ సభకు చేరుకున్న ముఖ్యమంత్రి. సుమారు గంటలపాటు ప్రసంగం. అనంతరం అధికారులతో సమీక్ష. » **1.50:** : సభా వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్ల పరిశీలన.

» **1.50-2.20:** కారవాన్‌లో విశ్రాంతి. » **2.20-2.50:** తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం. » **2.50-3.15:** తెదేపా శ్రేణులతో ఫొటోలు.

» **3.25:** హెలికాప్టర్‌లో తిరుగు పయనం.

అవీ.. ఇవీ..

★ గన్నెల బహిరంగ సభ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు తిలకించారు. ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో అవకాడో, లక్ష్మణఫలం, డ్రాగన్ ఫ్రూట్, ప్యాషన్ ఫ్రూట్ తదితర ఫలాలను ఆసక్తిగా పరిశీలించారు. విదేశీ పండ్ల మొక్కలను గిరిజన రైతులకు అందజేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

★ గిరిజన సహకార సంస్థ ఏర్పాటు చేసిన కాఫీ స్టాల్‌లో అరకు కాఫీని సీఎం చంద్రబాబు రుచి చూశారు.

★ ఎన్‌హెచ్ఆర్ఎం నిధులతో 104 ఆరోగ్య రథాలను మంత్రి సత్యకుమార్‌తో కలిసి సీఎం జెండా ఊపి ప్రారంభించారు. 104 ఆరోగ్య రథాల్లో సౌకర్యాలను పరిశీలించారు.

అందరూ బాగున్నారా.. పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించండి

అరకులోయ, న్యూస్‌టుడే: అమ్మా.. అందరూ బాగున్నారా అంటూ గన్నెల పంచాయతీ రామకృష్ణ నగర్‌లో అడుగు పెట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్కడి గిరిజనులను కుశల ప్రశ్నలు అడిగారు. గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని వారంతా జీవనోపాధి కోసం ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించగా.. కాఫీ, మిరియాలతో ఆర్థికంగా ఉన్నతి సాధిస్తున్నామని చెప్పారు. మిగిలిన భూముల్లో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై దృష్టిసారించాలని సీఎం వారికి సూచించారు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని, వారిని బాగా చదివించాలని, ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గ్రామంలోని ఓ మహిళ తన కుమార్తె నీట్‌కి సన్నద్ధమవుతోందని చెప్పగా.. నీట్ దేనికోసం అని సీఎం అడిగారు. డాక్టర్ చదివించేందుకు నీట్‌కు ప్రిపేర్ చేయిస్తున్నట్లు ఆమె చెప్పడంతో ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గర్భిణుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇద్దరు గర్భిణులకు వైద్య సేవల కోసం విజయవాడలో నిపుణులైన వైద్యుల సలహాల కోసం డాక్టర్ కన్సల్టేషన్ కోసం వీడియో కాల్ చేయించారు. వెంటనే స్పందించిన అక్కడి వైద్యులు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని వివరించారు. సంజీవని ప్రాజెక్టుతో ఇటువంటి వైద్యసేవలు నిరంతరం అందుతాయని గ్రామస్థులకు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన నాగమ్మ, సన్యాసమ్మ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు నలుగురేసి పిల్లలు ఉన్నారని.. వారందరికీ తల్లికి వందనం సొమ్ము బ్యాంకు ఖాతాకు జమైందని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

గర్భిణి ఆరోగ్య పరిస్థితిపై విజయవాడలోని వైద్య నిపుణులతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యం

★ స్థానిక పోరులో గెలుపు గుర్రాలకు టికెట్లు

★ తెదేపా కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు

ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఈనాడు డిజిటల్ - పాడేరు, న్యూస్‌టుడే అరకులోయ: 'మాటలు చెప్పేవారి కంటే.. కష్టపడి పనిచేసిన నేతలు, కార్యకర్తలకే గుర్తింపు, పదవులు దక్కుతాయి' అని సీఎం చంద్రబాబు అన్నారు. అరకులోయలో సంజీవని ప్రాజెక్టు ప్రారంభం అనంతరం తెదేపా శ్రేణులతో సమావేశమయ్యారు. వారినుద్దేశించి ప్రసంగిస్తూ.. 'పార్టీ విజయంలో నాయకులతోపాటు కార్యకర్తల పాత్ర ఎంతో ముఖ్యం. కార్యకర్త లేకపోతే పార్టీ లేదు. ఇది 54వ నియోజకవర్గ సమావేశం. గతంలో కంటే భిన్నంగా.. సొంత కుటుంబ సభ్యులతో సమయం గడిపినట్లుగా కార్యకర్తలతో నేరుగా కలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రానున్న మూడేళ్లలో 175 నియోజకవర్గాల సమీక్షలను పూర్తి చేయాలని భావిస్తున్నాం. గత ఎన్నికల్లో కార్యకర్తల కృషితో 94 శాతం స్ట్రైక్‌రేట్, 57 శాతం ఓటింగ్‌తో విజయం సాధించి చరిత్ర సృష్టించాం. సూపర్ సిక్స్ లాంటి పథకాలను వేగంగా అమలు చేస్తున్నాం. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీ అందరిపై ఉంది. 2024 కంటే మెరుగైన ఫలితాలను 2029 ఎన్నికల్లో సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని' పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చాం. ఓర్వలేక కొంతమంది కోర్టుకు వెళ్లారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. అక్టోబరు నెలాఖరులోగా ఎన్నికలు పూర్తి చేస్తాం. గతంతో పోలిస్తే అరకులోయ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి మెరుగుపడింది. మీరు ఇంకా కష్టపడాలి. స్థానిక ఎన్నికల్లో పట్టుదలతో పనిచేసి మెరుగైన ఫలితాలు రాబట్టాలి. మీలో ఎన్ని అభిప్రాయ బేధాలున్నా.. కలిసికట్టుగా పనిచేయాలి. ఒడిదొడుకులను ఎదుర్కొన్న వారే నేతలు అవుతారు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలి. నాయకుడు సైన్యాన్ని నడిపించే వాడే కాదు.. గెలిపించే వాడు అని సీఎం పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సెల్ఫీలు, ఫోటోలు దిగారు. అరకులోయ, పాడేరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు దొన్నుదొర, గిడ్డి ఈశ్వరి, జీసీసీ ఛైర్మన్ క్రిడారి శ్రావణ్‌కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

కిడారి, దొన్నుదొరలపై సీఎం అసంతృప్తి

కార్యకర్తల సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు.. ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కులాలు, వర్గాలుగా విడిపోయి పార్టీని బలహీనపరచ వద్దని హితవు పలికారు. ఇద్దరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రెండు వర్గాలుగా ఉంటూ రాజకీయం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన సుమారు 30 మంది పార్టీ బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులను ముఖ్యమంత్రి అభినందించారు.

కలల సాకారానికి 'పీఎం యశస్వి'

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రతిభ ఉన్నా ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలోనే మానేసి చిన్నతనంలోనే కొందరు ఉపాధి బాట పడుతున్నారు. ఈ పరిస్థితి మార్చాలన్న లక్ష్యంతో కేంద్రం పీఎం యంగ్ ఎచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రంట్ ఇండియా (పీఎం యశస్వి) కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఇప్పటివరకు అతి పెద్ద ఉపకారవేతన పథకాల్లో ఇది ఒకటి. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దీన్ని పర్యవేక్షిస్తోంది.

ఇదీ విధానం...

ఓబీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించరాదు. రైతులు, నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలవారికి ప్రాధాన్యం ఉంటుంది. కేంద్ర విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశపరీక్షలో అర్హత సాధించాలి. ఇది రాసేందుకు కనీసం ఎనిమిదోతరగతి పూర్తయి ఉండాలి. అర్హత సాధించాక అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొన్ని వివరాలతో దరఖాస్తు సమర్పించాలి. బ్యాంకు పాస్ పుస్తకం నకలు జతచేయాలి. ఎంపికైన వారికి 9,10 తరగతుల్లో ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియట్‌కు రూ.1.25 లక్షల చొప్పున ఉపకారవేతనం అందిస్తారు. ఈ మొత్తం బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమవుతుంది. కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కలిగిన ఏ పాఠశాల, కళాశాల అయినా చదవొచ్చు. 9 , 10 తరగతుల వారు కూడా పరీక్ష రాయవచ్చు. ఎంపికైతే మిగిలిన విద్యా సంవత్సరాలకు మాత్రమే ఉపకారవేతనం లభిస్తుంది.

★ ప్రవేశపరీక్ష రాసేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు పాఠశాల నోడల్ అధికారి ధ్రువీకరణ అవసరం. వివరాలు నమోదు చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు.

మారికవలసలోనే గురుకుల పాఠశాల

పాడేరు, న్యూస్‌టుడే: గురుకుల బాలురు ఆంగ్ల మాధ్యమ రెసిడెన్షియల్ పాఠశాలను విశాఖ జిల్లా మారికవలసలోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేర్వేరు పాఠశాలలకు తరలించి పూర్తిగా పాఠశాలను మూసివేసే ప్రక్రియను ఇటీవల ప్రభుత్వం దాదాపు పూర్తి చేసింది. పాఠశాలను కొనసాగించాలని డిమాండు చేస్తూ మూడు రోజులుగా పాడేరు ఐటీడీఏ కార్యాలయ గేటు ఎదుట ఆదివాసీ ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పోలీసులతో ధర్నా శిబిరం తొలగింపు, ఆదివాసీ సంఘాల నేతల అరెస్టులు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మతోపాటు ఎస్పీ శిబిరం వద్దకు వచ్చి గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆదివాసీ నేత అప్పలనర్స విద్యార్థుల బస్సుకు జెండా ఊపారు.

బస్సుకు జెండా ఊపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యుడు అప్పలనర్స, సీఐ రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఐటీడీఏ కార్యాలయం ఎదుట శనివారం ఉదయం శిబిరంలో సంబరాలు నిర్వహించారు. మారికవలస పాఠశాల నుంచి 130 మంది 9, 10 తరగతుల విద్యార్థులను తిరిగి అక్కడకు తరలించేందుకు ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేశారు. ఆ బస్సులో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులూ వెళ్లారు. ప్రజా సంఘాల నేతలు అప్పలనర్స, ధర్మాన్నపడాల్, రాధాకృష్ణ, చిన్ని, వై.కుమార్ తదితరులకు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

రేపు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ నెల 31న విశాఖ రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 9 గంటలకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10 గంటలకు ఎండాడ చేరుకుని ఏఐజీ ఆసుపత్రి నిర్మాణ పనులకు జరిగే భూమి పూజలో పాల్గొంటారు. 11.30 గంటలకు ఎండాడ నుంచి బయలుదేరి 11.50 గంటలకు నగరంలోని సిరిపురం కూడలి వద్దకు చేరుకుంటారు. అక్కడ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి 1.50 గంటలకు ఆనందపురం మండలం, గంభీరం సమీపంలోని ఐఐఎంకు వెళ్తారు. అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం 4.30 గంటలకు భోగాపురం విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్తారు.

నేడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

విశాఖపట్నం: నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష (కంప్యూటర్ ఆధార టెస్టు-సీబీటీ) జరగనుంది. విశాఖ నగరంలో మూడు కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు 1,947 మంది హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షకు అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రాలకు రావాలని అధికారులు సూచించారు.

WANTED STAFF
We require the following positions to work at our farm location in Srikakulam District:
★ POULTRY OPERATIONS MANAGER
Min: 3years Exp. in Large scale Desi poultry operations. (Breeding, Hatching, Brooding & Live stock Management)
★ FEED PRODUCTION SUPERVISOR
Min: 3years Exp. in Livestock Feed Procurement, Production & Management.
★ ACCOUNTANT
Min: 1year Relevent Exp. and Handle day to day Accounting and Book Keeping
PLEASE SEND YOUR RESUME ALONG WITH THE EXPERIENCE DETAILS:
JAYA BHUSHAN AGRO INDUSTRIES Pvt. Ltd.
SRIKAKULAM.
e-mail: hr.jbagro@gmail.com
Whats App: 92814 47232 & 92814 47238

ఇంకెన్నాళ్లీ యాతన?

ముంచంగిపుట్టు మండలం బుంగాపుట్టు పంచాయతీ కొజ్జిరిగుడ గ్రామానికి రోడ్డు సదుపాయం లేక రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. బుంగాపుట్టు వరకు ఉన్న పీఆర్ రోడ్డు నుంచి కొజ్జిరిగుడ వరకు 800 మీటర్ల పొడవున రహదారి, ఆ మార్గంలో వాగుపై కల్వర్టు నిర్మించాల్సి ఉంది. వాగుపై కల్వర్టు లేక గ్రామానికి చెందిన 30 కుటుంబాల గిరిజనులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను భుజాలపై మోసుకుంటూ ఒడ్డుకు చేర్చాల్సి వస్తోంది. వానాకాలంలో వాగు ఉప్పొంగితే గ్రామం వీడి బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. అత్యవసర వైద్యం కోసం రోగులను డోలీపై బుంగాపుట్టు రోడ్డు వరకు తరలించి ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. రోడ్డు, కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు**

మార్కెట్లోకి లంబసింగి సేంద్రియ ఉత్పత్తులు

రాష్ట్ర వ్యాప్తంగా 300 అవుట్‌లెట్లలో విక్రయాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: అరకు కాఫీకి తానే బ్రాండ్ అంబాసిడర్‌నని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తరచూ చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు.. లంబసింగిలో గిరి మహిళలు తయారుచేస్తున్న సేంద్రియ ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నారు. విశాఖలోని బీచ్ రోడ్డులోని ఈస్టర్న్ పవర్ ట్రైనింగ్ కేంద్రంలో శనివారం అగ్రి మైండ్స్ ఎకో సిస్టం ఫౌండేషన్, లంబసింగి ఆర్గానిక్ ట్రైబల్ ప్రొడక్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఎంవోయూపై సంతకాలు చేశాయి. ముఖ్యమంత్రి అరకు కాఫీకి ఇస్తున్న ప్రోత్సాహాన్ని దృష్టిలో పెట్టుకుని వాటికి అవసరమైన మార్కెటింగ్ చేయడానికి విశాఖకు చెందిన 'నేటివ్ అరకు కాఫీ' కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అరకు కాఫీకి సంబంధించిన ఉత్పత్తులను విక్రయించేందుకు 300 అవుట్‌లెట్లను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పలుచోట్ల 33 అవుట్‌లెట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఏర్పాటైన అవుట్‌లెట్స్‌తోపాటు త్వరలో ఏర్పాటుకానున్న వాటి వద్ద లంబసింగి రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు తయారు చేస్తున్న సేంద్రియ ఉత్పత్తులనూ విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

★ లంబసింగి ఎఫ్‌పీఓలో పూర్తిగా గిరిజన మహిళలే సభ్యులుగా ఉన్నారు. వీరు కాలానుగుణంగా మన్యంలో పండించే పసుపు, అల్లం, కాఫీ, మిరియాలు, చిరుధాన్యాలు, పనస, అనాస పనస వంటి వాటితో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీరికి నాబార్డు ఆర్థికసాయం అందిస్తుండగా.. హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తోంది. ఐదేళ్లలో సుమారు 100కు పైగా ఉత్పత్తులను వీరు తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. అగ్రిమైండ్స్ కంపెనీ విశాఖ వేదికగా నేటివ్ అరకు కాఫీ కంపెనీ, లంబసింగి ఎఫ్‌పీఓ మధ్య ఎంఓయూ కుదిరిందని ఎఫ్‌పీఓ సీఈవో రాజేష్ చెప్పారు. ఏపీ ఫుడ్ కార్పొరేషన్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, నాబార్డు డీడీఎం సమత్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

అగ్రిమైండ్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న లంబసింగి ఎఫ్‌పీఓ సీఈఓ రాజేష్, ఫుడ్ కార్పొరేషన్ విభాగం ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి

టీకాలు అందుబాటులో ఉంచాలని వినతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలు సుమారు 30 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్నాయి. శరభన్నపాలెం, వెలగలపాలెం, పెద మాకవరం, నడింపాలెం, బట్టపనుకుల, కినపర్తి, కొండగోకిరి, రత్నంపేట, రావణాపల్లి, అంతాడ, బంగారంపేట, నల్లగొండ పంచాయతీల్లోని ప్రజలంతా వైద్యసేవల కోసం రాజేంద్రపాలెం వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది టీకాలు అంత దూరం తీసుకెళ్లే సమయంలో అందులోని ఐస్ కరిగిపోతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీరందరికీ టీకాలు అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పీహెచ్‌సీలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, మండల అధ్యక్షుడు శివకుమార్, జనజాతీయ సంరక్షణ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు డీడీవీ ప్రసాద్, జి.సునీల్ కోరారు. ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డికి రాజవొమ్మంగిలో శనివారం వినతిపత్రం అందించారు. ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు.

ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న భాజపా నేతలు

శరవేగంగా సన్నద్ధత.. బ్యాలెట్ పెట్టెల కొరత

అనకాపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే వేడి మొదలైంది. బరిలో నిలిచే అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ సంబంధించిన అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాల పంచాయతీ ఓటర్ల, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ నెల 31న తుది ఓటర్ల జాబితా విడుదల చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అందరి దృష్టి ఎన్నికలపై పడింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పోలింగ్ సామగ్రి, వసతులు సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇటీవల పోలింగ్ కేంద్రాల తనిఖీలు సైతం పూర్తి చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికలు బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తారు. ఇందుకు పెట్టెలు అవసరం. బ్యాలెట్ పెట్టెలు ఏ మండలంలో ఎన్ని అందుబాటులో ఉన్నాయి, వాటిలో ఎన్ని ఉపయోగంలో ఉన్నాయనే వివరాలు సేకరిస్తున్నారు. కొరత ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాలా, కొత్తవి తయారు చేయించాలా అనే అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

బ్యాలెట్ పెట్టెలు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

వేధిస్తున్న బ్యాలెట్ బాక్సుల కొరత

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, అచ్యుతాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 24 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 646 గ్రామ పంచాయతీలు, 6,276 వార్డులు, 6,302 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 12,28,246 మంది పల్లె ఓటర్లు ఉన్నారు. జిల్లాలో రెండు విడతలుగా నిర్వహించే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తు ఎన్నికలకు సంబంధించి 8,135 బ్యాలెట్ పెట్టెలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం 4,590 పెట్టెలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంకా 4373 పెట్టెలు అవసరమని పంచాయతీ అధికారులు నివేదికలు తయారు చేశారు. పెట్టెల కొరతపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నారు.

బ్యాలెట్ పెట్టె వివరాలు ఇలా..

మండలాలు	: 24
గ్రామ పంచాయతీలు	: 646
అవసరమైన బ్యాలెట్ పెట్టెలు	: 8135
అందుబాటులో ఉన్నవి	: 4590
కొరత	: 4373

యూజీసీ నెట్‌లో గిరిజన యువతి ప్రతిభ

పాడేరు, న్యూస్‌టుడే: ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విడుదల చేసిన 2026-యూజీసీ నెట్ ఫలితాల్లో ఏయూ తెలుగు విభాగం విద్యార్థిని, గిరిజన యువతి సరోజిని జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) సాధించడంతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించిందని తెలుగు విభాగాధిపతి ఆచార్య జెర్రా అప్పారావు తెలిపారు. జేఆర్ఎఫ్ సాధించడం ద్వారా ఉన్నత స్థాయి పరిశోధనకు ఆర్థిక సహకారం అందుతుందన్నారు. తద్వారా జాతీయస్థాయిలో పరిశోధకురాలిగా ఎదిగే అవకాశం ఉందన్నారు.

స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

నక్కపల్లి: నక్కపల్లి ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు వచ్చినట్లు హెచ్ఎం పి.విజయ తెలిపారు. జిల్లాలో ఐదో స్థానంలో నక్కపల్లి నిలిచిందన్నారు. ఈ అవార్డును డీఈఓ నాగేశ్వరరావు చేతుల మీదుగా అనకాపల్లిలో శనివారం స్వీకరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపల్ రమణ అన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం చింతపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రికెట్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి కళాశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆటలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కెజియా, అధ్యాపకులు నాగేంద్రబాబు, పీడీ శివరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

మొదటి గురువులు తల్లిదండ్రులే

మాట్లాడుతున్న ఎస్సై సురేష్

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి తమ మొదటిగురువులు తల్లిదండ్రులేనని గూడెం కొత్తవీధి ఎస్సై సురేష్ అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తల్లిదండ్రుల సమావేశం(పీటీఎం) జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడారు. పిల్లల ప్రవర్తన, నడవడికపై నిశిత పరిశీలన ఉండాలన్నారు. విద్యార్థులు దారితప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలు అలవరుచుకుని మంచి ఫలితాలను సాధించాలని కోరారు.

నేపాల్ వరద బాధితులకు సంతాపం

నెహ్రూచౌక్ (అనకాపల్లి): నేపాల్‌లో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల చిన్నారుల సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలో హ్యాపీకిడ్స్ పాఠశాలలో చిన్నారులు శనివారం వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులు త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి రావాలని కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు.

డీఈఓ చేతుల మీదుగా బహుమతి అందుకున్న క్రీడాకారులు

జిల్లా ఉత్తమ క్రీడా పాఠశాలగా గుర్తింపు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లాలో ఉత్తమ క్రీడా పాఠశాలగా మాకవరపాలెం జడ్పీహెచ్ పాఠశాల నిలవడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు వీటూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా క్రీడల్లో రాణిస్తున్న పాఠశాలలను ఎంపిక చేయగా 158 పాయింట్లు వచ్చాయన్నారు. డీఈఓ అప్పారావు క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయుడు డి.రవిని సత్కరించారని తెలిపారు.

సీఎం ఆదేశించడంతో యంత్రాంగంలో కదలిక

'కల్యాణపులోవ' ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు

రావికమతం, న్యూస్‌టుడే: సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించడంతో కల్యాణపులోవ జలాశయ గర్భంలోని ఆక్రమణలపై యంత్రాంగంలో కదలిక వచ్చింది. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పొక్లెన్‌లతో తొలగించే చర్యలు చేపట్టారు. కల్యాణపులోవ రిజర్వాయర్ ద్వారా సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. జలాశయ గర్భం 200 ఎకరాల వరకు ఉండగా.. అందులో కొంత జిరాయితీ భూమి ఉందంటూ చీమలపాడుకు చెందిన ఓ మహిళ సహకారంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇటీవల జలాశయ గర్భాన్ని ఆక్రమించేందుకు పాల్పడ్డాడు. సుమారు 50 ఎకరాల వరకు మట్టితో పూడ్చేసి సాగు భూమిగా మార్చేశాడు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదు. దాంతో ఆక్రమణదారుడు ఎగువ పరీవాహక ప్రాంతం నుంచి రిజర్వాయర్‌కు నీరు చేరవేసే కొండ గెడ్డలు, వాగుల దారులను, పూర్వం నుంచి ఉండే గోర్జను మట్టితో పూడ్చి వేశాడు. వీటన్నింటి ఫలితంగా జలాశయంలోకి నీరు రాని పరిస్థితి నెలకొంది. దాంతో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు డ్రోన్ ద్వారా ఇక్కడి ఆక్రమణలను చిత్రీకరించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె అధికారులతో త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కూడా సరైన రీతిలో స్పందించకపోవడంతో ఇటీవల కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి జనసేన నేత రాజు ఈ విషయం తీసుకెళ్లారు. సీఎం వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ మేరకు శుక్ర, శనివారాల్లో మండల రెవెన్యూ, జల వనరులశాఖ అధికారులు జలాశయ పరిసరాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మూడు సర్వే సంఖ్యల్లో రిజర్వాయర్‌కు సంబంధించిన గోర్జను మట్టితో కప్పేసినట్లు గుర్తించి జేసీబీతో కొంత మేర తొలగించారు. మిగిలిన ఆక్రమణలను కూడా తొలగిస్తామని జల వనరుల శాఖ ఏఈ సూర్య తెలిపారు.

మట్టితో కప్పేసిన గోర్జను జేసీబీతో తొలగించారిలా..

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల పంచాయతీ చుట్టుమెట్ట వెళ్లే రహదారికి ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి విజయ దేవరాజు ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కార్యదర్శి పేర్కొన్నారు. గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని, నీటి వృథాను అరికడతామని చెప్పారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ మెరిట్ జాబితా విడుదల

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త కె.శ్రీరాములు తెలిపారు. సబ్జెక్టుల వారీగా జాబితాను https:///sites.google.com/view/apcsakp వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

PUBLIC NOTICE

నా క్లయింట్ శ్రీ కప్పిరి సోమేశ్వరరావు S/o కప్పిరి సోమలింగం, డోర్ నెం. 14-97/1, గుండాల వీధి, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం & జిల్లా, వారి తరపున ఈ పబ్లిక్ నోటీసు జారీ చేయబడుచున్నది.

రావికమతం మండలం, బాధనపాడు గ్రామంలో గల పాత సర్వే నం.40లో భాగం, కొత్త సర్వే నం.71/1లోని **Ac. 9.00 Cents** మెట్టు భూమి, క్రయదస్తావేజు Regd. Doc. No.101/2014 (చోడవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో), తేదీ. 09-01-2014 ప్రకారం నా క్లయింట్ కు సర్వహక్కులు మరియు స్వాధీన అనుభవములతో కలదు.

సదరు ఆస్తికి సంబంధించి **O.S. No. 102/2026** దావా 9వ అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు, చోడవరం నందు పెండింగు లో ఉంది. ఈ దావాలో ఆస్తిపై హక్కు, స్వాధీనం మరియు ఇతర పరిహారాలను నా క్లయింట్ కోరుతున్నారు.

సదరు షెడ్యూల్ ఆస్తిని **M/s Sai Charan Promoters (Visakhapatnam)**, దాని మేనేజింగ్ పార్టనర్ శ్రీ వేముల పరంధామనాయుడు మరియు బొల్లాప్రగడ శ్రీనివాస (గర్లకాం) మరియు గొర్ల విజయ్ కుమార్ (రావికమతం) సంబంధిత ఇతర వ్యక్తులు విక్రయించుటకు లేదా ఏ విధమైన బదలాయింపు చేయుటకు హక్కు లేదని నా క్లయింట్ తెలియజేయుచున్నారు. పై ఆస్తి కోర్టు వ్యాజ్యంలో ఉన్నందున, దానిపై ఎవరైనా క్రయవిక్రయాలు లేదా ఇతర బదలాయింపులు చేసిన పక్షంలో, అవి **O.S. No.102/2026** దావా ఫలితానికి లోబడి ఉంటాయి మరియు నా క్లయింట్ హక్కులకు బంధించవు.

కావున, పై షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు, బదలాయింపు చేసుకొనుటకు లేదా ఇతర విధంగా లావాదేవీ చేయుటకు ముందు సంబంధిత వ్యక్తులు కోర్టు వ్యాజ్యం మరియు ఆస్తి హక్కులను పూర్తిగా పరిశీలించవలసిందిగా ప్రజలకు తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి: రావికమతం మండలం, బాధనపాడు గ్రామం, పాత సర్వే నం.40లో భాగం, కొత్త సర్వే నం.71/1, విస్తీర్ణం Ac.9.00 Cents. : తూర్పు : ప్రభుత్వ బంజరు భూమి, దక్షిణం: దిబ్బ గ్రామ పొలిమేర, పడమర : బొల్లాప్రగడ వారి నుండి వెంకటేశ్వరరావు క్రయము పొందిన భూమి, ఉత్తరం : మేడివాడ నుండి కొట్నాబిల్లి వెళ్లే రహదారి

A V.S. BHAVANI PRASAD(B.Sc.,B.L), ADVOCATE
D.No:1-2-5, Ramalayam Street, Gandhinagaram, ANAKAPALLI-531 001.

అందరి సహకారంతో అంధత్వనివారణ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: అంధత్వ నివారణకు అందరి సహకారం అవసరమని, నేత్రదానంపై అపోహలు విడనాడాలని కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రమ్యప్రభ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం కిలగాడలో ర్యాలీ నిర్వహించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు అవగాహన కల్పించారు. నేత్రదానం అన్నిదానాల్లో గొప్పదని పేర్కొన్నారు. సీహెచ్ఓ సౌరప్పడు, పీహెచ్ఎన్ పెద్దమ్మి, హెచ్‌వీ లక్ష్మీ, పీఎంఓ కిషోర్, పాల్గొన్నారు.

కిలగాడలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

క్రీడానైపుణ్యాల మెరుగుపై శ్రద్ధ

వ్యాయామ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ నిశాంతి, చిత్రంలో డీఈఓ భానుమూర్తిరాజు తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల మెరుగుపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ నిశాంతి వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో శనివారం మధ్యాహ్నం ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల నుంచి మంచి క్రీడాకారులను తయారు చేయాలని ఆదేశించారు. పోటీల్లో ప్రథమ స్థానం అరకు గురుకుల క్రీడా పాఠశాల, ద్వితీయ స్థానం పాడేరు మండలం గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల, తృతీయ స్థానం తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ, నాలుగో స్థానం హుకుంపేట మండలం సూకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ, ఐదో స్థానం జి.మాడుగుల మండలం నుర్మతి గిరిజన సంక్షేమ పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. భానుమూర్తిరాజు, సూరిబాబు, భూపతి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

మునగపాక, న్యూస్‌టుడే: గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థులందరూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మంత్రి నాదేండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. మునగపాక మండలం నాగవరానికి చెందిన జనసైనికుడు చొప్పా శ్రీను గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అచ్యుతాపురం మండలం జెడ్పీటీసీగా జనసేన తరఫున పోటీ చేశారు. మంగళగిరిలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన్ను సత్కరించారు.

గతంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేసిన చొప్పా శ్రీనును సత్కరిస్తున్న మంత్రి మనోహర్

శ్రావణ మాసం.. పెళ్లిళ్లకు శ్రీకారం

★ అన్ని కులాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో అవివాహితులకు సువర్ణావకాశం

★ నేడు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' అన్ని కులాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. నగరంలోని అక్కయ్యపాలెం అబిద్‌నగర్ రత్నమాల రెసిడెన్సీలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

★ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు(ఆదివారం, ఆగస్టు 30) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

★ మరిన్ని వివరాలకు **91549 18858, 80086 33318** నంబర్లకు ఫోన్ చేయవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను ఇక్కడ తెలిపిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు. ★ ఈ శ్రావణంలో ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకొనే ప్రతి ఒక్కరి ప్రొఫైల్‌ను ఒక నెల పాటు ఎక్కువ మంది చూసుకునే అవకాశం(ప్రొఫైల్ హైలైటర్) కల్పిస్తున్నాం. అంతేకాకుండా మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం(అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్టులు)కూడా పొందవచ్చు.

దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా విషాదం

చెల్లి లలితతో సోదరులు నవీన్, శివప్రసాద్ (వృత్తంలో) (పాతచిత్రం)

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదమ్ములిద్దరూ వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఏడువారాల మొక్కు (5వ వారం పూజ) తీర్చుకునే క్రమంలో శనివారం ఉదయం వేకువజామున ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి బయలుదేరి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో తమ్ముడు మృతి చెందగా, అన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబీకులు, గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపిన వివరాలివీ మాడుగుల మండలంలోని ఎ.వీరనారాయణం పంచాయతీ కాగిత గ్రామానికి చెందిన రొబ్బా రమణ, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కొడుకు నవీన్ దివ్యాంగుడు. రెండో కుమారుడు శివప్రసాద్ (22), కుమార్తె లలిత ఉన్నారు. నవీన్ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటుండగా.. శివప్రసాద్ డిప్లొమా, లలిత ఇంటర్ చదువు పూర్తి చేశారు. నవీన్, తమ్ముడు శివప్రసాద్(22) ద్విచక్రవాహనంపై వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామంలోని బరోడా బ్యాంకు ఎదురుగా వచ్చేసరికి టిప్పర్ బలంగా ఢీ కొట్టింది. ప్రసాద్‌పై నుంచి లారీ ఎక్కగా, నవీన్‌ను కొంతదూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్ (22) అక్కడికక్కడే మృతి చెందగా, నవీన్ చేయి నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర గాయాలైన నవీన్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రసాద్‌ను జడ్.రాగంపేట సీహెచ్‌సీకి తరలించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లలితకు ఇటీవల నిశ్చితార్థం కావడంతో అందరూ సంతోషంగా ఉన్న సమయంలో ఈ ఘటన జరగడంతో కుటుంబీకులు బోరున విలపించారు.

మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: అచ్యుతాపురం నాన్‌సెజ్‌లో పేరక్ ప్లాస్ట్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము డిమాండు చేశారు. ఆ పరిశ్రమలో ఒప్పంద కార్మికుడుగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కుషాన్ మాజీ హి (32) మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడని స్థానిక ఎస్సై నాగేంద్ర చెప్పారు. కుషాన్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని, మృతదేహం కేజీహెచ్ మార్చురీలో ఉంచారని ఆయన తెలిపారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము మండిపడ్డారు. యాజమాన్యం కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా లాభాలే పరమావధిగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే యాజమాన్యంపై చర్యలు తీసుకొని కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండు చేశారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు: ఎమ్మెల్సీ ఆలపాటి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గాజువాక, న్యూస్‌టుడే: ఉన్నత చదువులతోపాటు నైపుణ్య శిక్షణ అలవర్చుకుని యువత ఉపాధికి బాటలు వేసుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గాజువాక శ్రీనగర్‌లోని టీఎస్సార్, టీబీకే కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగాజాబ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలపాటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల మ్యానిఫెస్టోలో 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించనున్నట్లు ప్రకటించిందని.. ఆ ప్రకారంగా అన్ని నియోజకవర్గాల్లో మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ.. ఇటీవల 8 జాబ్‌మేళాలు నిర్వహించగా 1627మందికి ఉద్యోగాలు దక్కాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం యువతకు అన్ని అవకాశాలు సమృద్ధిగా కల్పిస్తోందన్నారు. జాబ్‌మేళాలో 74 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా.. 3వేల ఖాళీల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

మెడ్‌కో డాక్టర్ శివరామకృష్ణకు చుక్కెదురు

విశాఖపట్నం: కింగ్ జార్జి ఆసుపత్రి(కేజీహెచ్)లో ఎన్టీఆర్ వైద్య సేవలను పర్యవేక్షించేందుకు ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి ఇటీవల నియమించిన మెడ్‌కో(మెడికల్ కోఆర్డినేటర్) డాక్టర్ శివరామకృష్ణకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు నుంచి చుక్కెదురైంది. ఆయనకు లాగిన్ ఇవ్వడానికి ట్రస్టు వైద్యాధికారులు అంగీకరించలేదు. ఇప్పటికే ఆయన పేరు విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో లాగిన్ కావడంతో కేజీహెచ్‌లో ఇచ్చేందుకు నిరాకరించారు. ఎక్కడో ఒకచోట మాత్రమే లాగిన్ అవడానికి అవకాశం ఉందని తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ ఫ్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

Govt **ఎంప్లాయిస్‌కు,** రిటైర్డ్ పెన్షనర్స్‌కు సులభవాయిదా పద్ధతిలో ఫైనాన్స్ ఇవ్వబడును. SBI బ్యాంక్ అకౌంట్‌లో పడేవారికి మాత్రమే ✆ 72888 75668.

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

JOBS

హైదరాబాద్ L.Bనగర్ ఓల్డేజ్ హోమ్ పనిచేయుటకు ANM GNM నర్సింగ్ స్టాఫ్ కావలెను. జీ: 20వేలు ఉచిత వసతి భోజనం. ✆ 9248580427, 9676335813

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. **ఆయాలు** / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

4న సింహగిరిపై శ్రీకృష్ణ జయంతి

సింహాచలం, న్యూస్‌టుడే: వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జయంతిని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఈవో జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. ఉత్సవం నేపథ్యంలో ఆ రోజు రాత్రి 7గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని తెలియజేశారు. రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 5వ తేదీన సాయంత్రం 4.30గంటల నుంచి సింహగిరిపై ఆలయ రాజగోపురం ఎదురుగా ఉట్ల సంబరం జరుగుతుందన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: గుర్రాజుపేట కూడలి సమీపంలో అతివేగంతో వచ్చిన కారు సైకిల్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. నక్కపల్లి మండలం చినతీనార్లకు చెందిన పెంకె మన్నయ్య (65), గుడివాడలో భూమిని కౌలుకు సాగుచేస్తున్నారు. శనివారం రాత్రి పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా రేవుపోలవరం నుంచి అతివేగంగా వచ్చిన కారు వెనుకనుంచి మన్నయ్య సైకిల్‌ను, మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మన్నయ్య తలకి గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కారు నడిపిన వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు.

మాటల్లో పర్యాటకం.. అదంతా నాటకం

★ డొక్కు బస్సుల్లో వెళ్లేదెలా?
★ అధికారుల చర్యలతో ఆదాయానికి గండి
★ 'ప్రైవేట్ ట్రావెల్స్' వైపు చూస్తున్న పర్యాటకులు

ఈనాడు, విశాఖపట్నం: పర్యాటకం పేరెత్తిన వెంటనే గుర్తుకు వచ్చేది విశాఖపట్నం, పరిసర ప్రాంతాలే. అంతగా జనం మనసుల్లో నిలిచిపోయిన అద్భుతాలను అందరూ చూడాలని పర్యాటక రంగానికి ఊతం ఇచ్చే ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రమంలో అసలు సంగతి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయా ప్రాంతాలకు వెళ్లేలా నడపాల్సిన వాహనాలు చూస్తే... ఎవరూ పర్యాటక శాఖ కేంద్రం వైపే కన్నెత్తి చూడరు అనేలా ఉన్నాయి. డొక్కు బస్సులు.. అరిగిన టైర్లతో పర్యాటక శాఖ ప్యాకేజీలు నడుస్తున్నాయి. కనీసం ఏసీ సౌకర్యం కూడా లేదు. ఇదే సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు చక్కటి ప్యాకేజీలతో తమ వైపు తిప్పుకుంటున్నారు. ఇలా అయితే పర్యాటక శాఖకు ఆదాయం ఎలా వస్తుంది? కావాలనే ఇలా చేస్తున్నారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సీజన్ మొదలయ్యే నాటికి..

వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తారు. నగర అందాలతో పాటు అరకు, అనంతగిరి, బొర్రా, లంబసింగి ప్రాంతాలను సందర్శిస్తారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝూర్ఖండ్ రాష్ట్రాల నుంచి సందర్శకులు వస్తుంటారు. వీరంతా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) నిర్వహించే ప్యాకేజీల్లో వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. దసరా నుంచి పర్యాటకుల తాకిడి మరింత పెరగనుంది. ఈ డిమాండును దృష్టిలో ఉంచుకొని కొత్త వాహనాలను సమకూర్చుకోవాల్సి ఉంది.

మూలకు చేరిన బస్సులు

ఆ వాహనాలతోనా: విశాఖ కేంద్రంగా బస్సులు, ఇన్నోవాలు గతంలో పది వరకు ఉంటే ఇప్పుడు అయిదే తిరుగుతున్నాయి. అవన్నీ పాతబడగా వాటితోనే అరకు ప్యాకేజీలు నడుపుతున్నారు. రెండు ఇన్నోవాలు తీసుకొని 15 ఏళ్లయింది. నాన్ ఏసీ 18 సీట్ల బస్సులు రెండు, 36 సీట్ల బస్సు ఒకటుంది. వీటిని 2013లో కొనుగోలు చేశారు.

★ ప్రతి వాహనం లక్ష కిలోమీటర్ల పైబడి తిరిగింది. అవే ఘాట్ రోడ్లలో ప్రయాణిస్తున్నాయి. కనీసం కొత్త మోడల్ కార్లయినా లేవు. రెండు 18 సీట్ల బస్సులు, ఒక 36 సీట్ల బస్సు మూలకు చేరాయి.

ప్యాకేజీలపై ప్రభావం..

★ ప్రస్తుతం నడుస్తున్నవి పర్యాటకుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఒకసారి వచ్చిన వారు మళ్లీ ఆ ప్యాకేజీలు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. గతంలో విశాఖ-లంబసింగి-పాడేరు, విశాఖపట్నం హెరిటేజ్ టూర్, అరకు-లంబసింగి, అరకు-మాచ్‌ఖండ్, విశాఖ- అరసవల్లి శ్రీకూర్మం- శ్రీముఖలింగం, విశాఖ- సింహాచలం- అన్నవరం, విశాఖ-కోరంగి, విశాఖ-దాక్షారామం, విశాఖ- పాపికొండలు ప్యాకేజీలు నిర్వహించేవారు. వాటికి అంతంత డిమాండు ఉండగా సరైన బస్సులు లేకపోవడంతో ఆపేశారు. ఆ తర్వాత ప్రైవేటు బస్సుల నిర్వాహకులతో కలిసి చేపట్టినా పెద్దగా విజయవంతం కాలేదు.

★ గతంలో విశాఖ నుంచి తిరుపతికి వారంలో రెండుసార్లు పర్యాటక బస్సులు నడిపేవారు. ఇందుకు రెండు వోల్వో బస్సులు తిరిగేవి. కొవిడ్ తర్వాత మళ్లీ నిర్వహించాల్సినప్పటికీ రోడ్డెక్కలేదు. ఆ తర్వాత ఆ రెండు బస్సులు విశాఖ నుంచి వెళ్లిపోయాయి.

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

విజయనగరం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన 82 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. విజయనగరం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ పీవీవీ నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షాటన చేసుకుంటున్న ఒక వృద్ధురాలిపై ఇటీవల విజయనగరంలోని గాజులరేగ రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని విశాఖపట్నంలోని గాజువాక ప్రాంతానికి చెందిన శీల ప్రసాదరెడ్డిగా గుర్తించారు. అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుడు 15 ఏళ్ల క్రితమే వలస వచ్చి, ప్లాస్టిక్ సీసాలు సేకరించి, ఆ డబ్బులతో జీవిస్తున్నాడన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	114	105
లైవ్	141	125
డ్రెస్డ్	219	220
స్కిన్‌లెస్	247	230

చంద్రబాబుకు నీరాజనం

అరకులోయ/పట్టణం, డుంబ్రిగుడ, పాడేరు, న్యూస్‌టుడే: అరకులోయ మండలం గన్నెలలో సంజీవని పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు నీరాజనాలు పలికారు. గన్నెలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు రాధాకృష్ణ, శిరీషాదేవి, ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర, గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నిశాంతి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగదీశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ తదితరులు ఘన స్వాగతం పలికారు. సీఎం రాకతో హెలిప్యాడ్ ప్రాంగణంలో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. మహిళా నేతలు సీఎంకు తిలకందిద్దారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో పటిష్ఠ బందోబస్తు నడుమ ఆర్‌కేనగర్ బయలుదేరారు.

★ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మండల అధికారులు సభా ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు.

ఆర్‌కేనగర్ గ్రామస్థులతో ముఖ్యమంత్రి

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం

అభిమాన నేతకు విక్టరీ సంకేతం చూపిస్తున్న కార్యకర్తలు

హెలిప్యాడ్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తూ..

గన్నెల పీహెచ్‌సీలో సంజీవని కేంద్రంలో వివరాలు తెలుసుకుంటూ..

ఘన స్వాగతం

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నిశాంతి, గిడ్డి ఈశ్వరి, కిడారి శ్రావణ్‌కుమార్, బుద్ధ నాగజగదీశ్వరరావు, రాధాకృష్ణ, శిరీషాదేవి, కోట్ని బాలాజీ (కుడి నుంచి ఎడమకు వరుసగా)

కఠిన ఆంక్షలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లరంగు వస్త్రాలున్నా అనుమతించలేదు. కనీసం పెన్నును కూడా అనుమతించలేదు.

సెక్యూరిటీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

అరకు కాఫీని ప్రమోట్ చేశా.. కానీ ఓట్లు వేయరు!

ఈనాడు డిజిటల్ – పాడేరు: 'అరకు కాఫీని నేనే ప్రమోట్ చేశాను. కానీ మీరు ఓట్లు వేయడంలేదు. అందుకే గత ఎన్నికల్లో ఓడిపోయాం. రాష్ట్రమంతా గెలిపించారు కాబట్టే అభివృద్ధి జరుగుతోంది. మీరు అర్థం చేసుకోవాలి. అరకు కాఫీకి నేనే బ్రాండ్ అంబాసిడర్. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దీని గురించి చెప్తున్నాను. కానీ మీరు మాత్రం ఓటు వేయడం లేదు. గత ఎన్నికల్లో మిత్రధర్మం కింద భాజపాకు సీటు ఇచ్చాం. మీరు ఓటువేయకనే ఓడిపోయారు. గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నా'మని ఆర్‌కేనగర్‌లో గిరిజనులతో మాటామంతి సందర్భంగా సీఎం వ్యాఖ్యలు చేశారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా

మన్యం ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు మరింత చేరువ చేయడం సంజీవని ప్రాజెక్టు లక్ష్యం. సంజీవని కేవలం వైద్య కార్యక్రమం మాత్రమే కాదు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా. ప్రతి తల్లికి ధైర్యం. ముఖ్యమంత్రి నాయకత్వంలో జిల్లాలో ఆరోగ్యం, విద్య, తాగునీరు, రహదారులు, మౌలిక వసతులు, వ్యవసాయం, ఉపాధి, గిరిజన సంక్షేమ రంగాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో జిల్లా తనవంతు పాత్ర సమర్థవంతంగా నిర్వహించేలా యంత్రాంగం కృషిచేస్తోంది.

– టి.నిశాంతి, జిల్లా కలెక్టర్

చంద్రబాబుతోనే గిరిజనుల వికాసం: గిరిజనుల వికాసం సీఎం చంద్రబాబుతోనే సాధ్యం. గిరిజన ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న డోలీమోతల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ.. ప్రతి పల్లెకు రోడ్ల అనుసంధానం కల్పించి డోలీ మోత రహిత గ్రామాలుగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.340 కోట్లతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, గిరిజన సంక్షేమ ద్వారా రూ.218 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేశారు. చిన్న నీటిపారుదలశాఖ ద్వారా రూ.50 కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం, గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా రూ.68 కోట్ల నిధులతో రక్షిత మంచినీటి సౌకర్యాలు కల్పించింది ఈ ప్రభుత్వం. గత ప్రభుత్వంలో పర్యాటకం, కాఫీ ప్రాజెక్టులు నిర్వీర్యం చేశారు. – దొన్నుదొర, ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఛైర్మన్

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చింతపల్లి నుంచి గూడెంకొత్తవీధి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పొదలు, తుప్పలు పెరిగిపోయాయి. మలుపుల్లో కనీసం ప్రమాద సూచీలు లేవు. – **రాజారావు, ఆర్వీనగర్,** ✓: రహదారి నిర్వహణ నిధులు వచ్చిన వెంటనే తుప్పల తొలగింపుతోపాటు ప్రమాద సూచీలు ఏర్పాటు చేస్తాం. – **జయరాజ్, ఆర్అండ్‌బీ జేఈ, చింతపల్లి**

స్పందనకు వందనం

స్తంభాలు సరిచేశారు!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్‌లోని ఏపీఎఫ్‌డీసీ డివిజన్ కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. చాలాకాలంపాటు ఇవి అలాగే ఉండిపోయాయి. దీనిపై మేమున్నాం మీకుతోడుగా శీర్షికన కొద్ది రోజుల క్రితం 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. దీనికి చింతపల్లి ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. విద్యుత్తు నియంత్రిక వద్ద ఒక పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి కొత్తవాటిని అమర్చారు.

ఊరూరా 'గొలుసు'.. అడగరని అలుసు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

మద్యం ప్రియుల వ్యసనాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అధిక ధరకు విక్రయాలకు తెరలేపారు. విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. డుంబ్రిగుడకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని అరుకులో లైసెన్సు దుకాణం నడుస్తోంది. అరకులోయలో నాలుగు, అనంతగిరి మండలంలోని కాశీపట్నంలో లైసెన్సు దుకాణాలు ఉన్నాయి. గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే రూ.50 చొప్పున అధికంగా అమ్మకాలు సాగిస్తున్నట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. డుంబ్రిగుడ మండలంలో 18 పంచాయతీల కేంద్రాలతోపాటు మారుమూల గ్రామాల్లో విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు ఉన్నాయి.

★ మద్యం దుకాణదారులే పోటీపడి గొలుసు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు గొలుసు దుకాణదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి ఊరిలో రెండు కంటే ఎక్కువ బెల్టు దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాలతో గ్రామాల్లో శాంతి భద్రతలు కరవయ్యాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

ప్రజాప్రతినిధులు, గిరిజనుల ఫిర్యాదు మేరకు గొలుసు దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఈనెలలో మూడు కేసులు నమోదు చేశాం. లైసెన్సు ఉన్న దుకాణదారులు ప్రైవేటుగా గొలుసు దుకాణాలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. తనిఖీల్లో పట్టుబడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు సిబ్బందితో నిఘా పెడుతున్నాం. – శ్రావణ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, అరకులోయ

అధునాతన హంగులతో పోలీస్‌స్టేషన్ నిర్మాణం

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాలను గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే సుమారు రూ. 80 లక్షల వ్యయంతో ఈ అధునాతన భవనాలు నిర్మించారు. పర్యాటక ప్రాంతమైన అరకులోయలో అధునాతన పోలీస్‌స్టేషన్ అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ అమిత్ బర్దార్, ఎమ్మెల్యే మత్స్యలింగం, ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ దొన్నుదొర, జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, సీఐ కోటేశ్వరరావు, ఎస్సై మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఐజీ గోపీనాథ్ జెట్టి తదితరులు

మారని రాత.. తప్పని మోత!

మన్యంలో డోలీమోతలు తప్పడం లేదు. యు.చీడిపాలెం పంచాయతీ.. మండల కేంద్రానికి సుదూరంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉంది. ఈ పంచాయతీలోని మర్రిపాకలు గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో పలుచోట్ల బురదమయంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. మర్రిపాకలు గ్రామానికి చెందిన కోరాబు పద్మ అనారోగ్యంతో బాధపడుతోంది. మర్రిపాకలు నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని పలకజీడి గ్రామానికి కొంత దూరం బైక్‌పై, మిగిలిన దూరం డోలీపై ఆమెను బంధువులు మోసుకొచ్చారు. అక్కడ నుంచి పోలవరం జిల్లా వై.రామవరం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రభుత్వం స్పందించి మర్రిపాకలు గ్రామానికి తారురోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి గిరిజనులు కోరుతున్నారు.

– కొయ్యూరు, న్యూస్‌టుడే

బురద దారిలో మహిళను డోలీపై మోసుకెళ్తున్న బంధువులు

నాటు పడవే ఆధారం

సుజనకోట పంచాయతీలోని గొడుగులపుట్టు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పడవ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దాదాపు 15 ఏళ్ల క్రితం పాడేరు ఐటీడీఏ ద్వారా పంచాయతీలోని గిరిజన మత్స్యకారులకు పడవను అందించారు. అది మరమ్మతులకు గురైనప్పుడు బాగుచేయకపోవడంతో మూలకు చేరింది. పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల గిరిజనులకు నాటు పడవలే ఆధారమయ్యాయి. సుజనకోట, పెదగుడ, ఏనుగురాయి పంచాయతీలకు చెందిన గ్రామాల గిరిజనులు నాటు పడవలను ఆశ్రయించి మత్స్యగెడ్డపై రాకపోకలు సాగిస్తున్నారు. మత్స్యగెడ్డ ఉప్పొంగినప్పుడు వీటిపై చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. గిరిజనులకు ఉపయోగపడేలా ప్రభుత్వం పడవలు ఇవ్వాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

గొడుగులపుట్టులో నిరుపయోగంగా పడవ

మురుగుతో ముప్పు

సంతవలసలో నిలిచిన మురుగు

సంతవలసలో మురుగు వ్యవస్థ క్షీణించింది. డ్రైనేజీలు ఉన్నప్పటికీ ఎక్కడికక్కడే మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువైందని, వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

ఎట్టకేలకు రహదారి నిర్మాణానికి నిధులు

మంప పంచాయతీ పైడిపనుకుల గ్రామ ప్రజల రహదారి కష్టాలు తీరనున్నాయి. తుమ్మలబంద నుంచి పైడిపనుకుల గ్రామానికి వెళ్లే రహదారి సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా తయారవుతోంది. ఈ సమస్యను స్థానికులు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. రహదారి నిర్మాణానికి రూ.1.4 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, తొందర్లోనే పనులు ప్రారంభమవుతాయని జేఈ కిరణ్ తెలిపారు. నిధులు మంజూరవ్వడంపై మాజీ సర్పంచి రాజుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

– కొయ్యూరు, న్యూస్‌టుడే

బురదమయంగా రహదారి

పనులు పూర్తయ్యేదెన్నడో!

శరభన్నపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. పాఠశాలలో భోజనశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వెంటనే పనులు ప్రారంభించారు. స్లాబు వేసి నిర్మాణం మధ్యలో వదిలేశారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– కొయ్యూరు, న్యూస్‌టుడే

అ వీ ఇ వీ

సదరం బుకింగ్‌కు ఇబ్బందులు

సీలేరు, న్యూస్‌టుడే: అంతర్జాలం పనిచేయకపోవడంతో సదరం స్లాట్ బుక్‌చేయడానికి మూడు రోజుల నుంచి సీలేరు సచివాలయం చుట్టూ తిరుగుతున్నానని దివ్యాంగుడు పిల్లా ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాలం బిల్లు చెల్లించకపోవడంతో సేవలు నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సచివాలయ సేవలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుడు కోరారు.

బస్సు సర్వీసులు నడపాలి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పాడేరు నుంచి వంజరి, లంబసింగి మీదుగా నర్సీపట్నం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ శనివారం కోరారు. పాడేరు నుంచి లంబసింగి వరకు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో ఒక్క బస్సు సర్వీసు లేదన్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించాలని విన్నవించారు.

'మీకోసం' రేపు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి పంచాయతీ చిన్నగెడ్డ సచివాలయం-2 వద్ద ఈ నెల 31వ తేదీన మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సమస్యలను వినతుల రూపంలో అందజేయాలన్నారు. మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: దామనాపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం మీకోసం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణబాబు తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

మొక్కలు పంపిణీచేయాలని వినతి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెన్నవరం పంచాయతీ కట్టుబీధి గ్రామ గిరి రైతులకు సిల్వర్‌ఓక్ మొక్కలు పంపిణీ చేయాలని గ్రామస్థులు చిన్నబ్బాయి, బాలకృష్ణ, లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో సీతామహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా గ్రామానికి చెందిన 21 మంది గిరిజన రైతులకు మొక్కలు మంజూరు అయ్యాయని, వెంటనే పంపిణీ చేయాలని కోరారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు

పాడేరు, న్యూస్‌టుడే: వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు రామమూర్తి అని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. శనివారం రామమూర్తి జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ సునీతాదేవి, రాధాకుమారి, శ్రీనివాసమూర్తి తదితరులు రామమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వంగసారలో పదోతరగతి తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి గ్రామీణం, కొయ్యూరు, న్యూస్‌టుడే: వంగసార బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో పదో తరగతిలో తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు పాంగి రత్నవేణి, కిల్లో నైనమ్మ, సాగిన లావణ్యలను సత్కరించారు. మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుధ, కొయ్యూరు బాలురు-1 ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు.

సీలేరు, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సీలేరు ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో తెలుగు ఉపాధ్యాయులకు సత్కారం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపల్స్ కేశవరావు, కుసుమకుమారి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థిని పాంగి హిమబిందు తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకుంది.

సీలేరులో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

చిన్నారులకు తప్పని నడక

అరకులోయ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా పోలీసులు ఉదయం నుంచే గన్నెల సభావేదిక మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేశారు. దీంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. అమలగుడ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలోని గన్నెల ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. నిత్యం వాహనాల్లో బడికి వెళ్లే విద్యార్థులు ఆంక్షల కారణంగా రెండు కిలోమీటర్లు నడుచుకుంటూనే శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లాల్సి వచ్చింది.

గన్నెల పాఠశాలకు కాలినడకన వస్తున్న చిన్నారులు

కిడారి దంపతులకు సీఎం ఆశీర్వాదం

అరకులోయ, న్యూస్‌టుడే: గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ దంపతులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీర్వదించారు. ఈ ఏడాది మేలో శ్రావణ్‌కుమార్, శ్రీప్రియలకు పాడేరులో వివాహం జరిగింది. ఈ వివాహానికి హాజరుకాలేకపోయిన ముఖ్యమంత్రి.. గన్నెల పర్యటనలో భాగంగా కారవాన్‌లో కిడారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కిడారి శ్రావణ్‌కుమార్ దంపతులు

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణింపు

సీలేరు, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా రాజాంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీలేరు ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించింది. అండర్-14 షాట్‌పుట్ విభాగంలో పదోతరగతి చదువుతున్న దక్షిత ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఎల్ఎంసీ ఛైర్మన్, పర్యవేక్షక ఇంజినీరు జాకీర్ హుస్సేన్, ఏపీ జెన్‌కో ప్రాంతీయ అధికారి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు బి.నాగేంద్రరాజు.. విద్యార్థిని, వ్యాయాయ ఉపాధ్యాయుడు కమాలకర్‌ను అభినందించారు.

మొదటి స్థానం సాధించిన దక్షితతో నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

ట్రాక్టర్ బోల్తా

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రొంపల్లి పంచాయతీ మర్రివలస గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. పెదరాభ నుంచి మర్రివలస గ్రామానికి వస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. అంతా సురక్షితంగా బయటపడ్డారు.

సీఎం సభకు వస్తున్న ఆటో..

అరకులోయ, న్యూస్‌టుడే: గన్నెలలోని ముఖ్యమంత్రి సభకు ప్రయాణికులతో వస్తున్న ఆటో శనివారం బట్టివలస సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. డుంబ్రిగుడ మండలానికి చెందిన గిరిజనులు సభలో పాల్గొనేందుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు అరకులోయ ప్రాంతీయ వైద్యకేంద్రంలో చికిత్స అందించారు.

ఎట్టకేలకు తీరిన గ్యాస్ సమస్య

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నెల రోజులుగా చింతపల్లి, చుట్టుపక్కల గ్రామాలకు గ్యాస్ సిలిండర్ల సరఫరా లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చింతపల్లి జీసీసీ బ్రాంచి మేనేజర్ సుగుణాథం దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఓటీపీ ఉన్న లబ్ధిదారులకు ఆటోల ద్వారా సిలిండర్లు పంపిణీ చేస్తున్నారు. చింతపల్లి, తాజంగి, లోతుగెడ్డ కూడలి, అన్నవరం తదితర గ్రామాలకు ఆటోలు, వ్యాన్ల ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారు. వ్యాన్ల ద్వారా కొయ్యూరుకు సిలిండర్లు తరలించారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు సిలిండర్లు దిగుమతి చేసుకుంటున్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేనేజర్ తెలిపారు. సిలిండర్ల కోసం గ్యాస్ గోదాము వద్దకు రావాల్సిన అవసరం లేదని, ఓటీపీ ఆధారంగా పారదర్శకంగా సిబ్బంది పంపిణీ చేస్తున్నారన్నారు.

పీఎం జన్‌మన్ గృహనిర్మాణాలు వేగవంతం

గూడెంకొత్తవీధి, సీలేరు, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గృహనిర్మాణ సంస్థ ఈఈ, పీఎం జన్‌మన్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం దావనాపల్లి పంచాయతీ గొడుగుమామిడి, నల్లబెల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

★ చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీలో గృహనిర్మాణసంస్థ చీఫ్ ఇంజినీరు జయరామాచారి పర్యటించారు. వంగసార, గెత్తంపాకలు గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం ద్వారా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గొడుగుమామిడిలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

భక్తిశ్రద్ధలతో ఆరాధన ఉత్సవాలు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్రస్వామి ఆలయంలో రాఘవేంద్రస్వామి మూలమృత్తిక బృందావన మందిరం ఆధ్వర్యంలో స్వామి 355వ ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోపూజ, లక్ష్మీపూజతో ప్రారంభించారు. శనివారం కనక మహాపూజ, అభిషేకాలు, అష్టోత్తర గోత్రనామపూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నకు శనివారం విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామున కొండపై నిజరూపానికి అర్చకులు అభిషేకం చేశారు.

నేడు గ్రంథాలయం ప్రారంభోత్సవం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు చౌడుపల్లి గ్రామస్థులు సొంతంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. గ్రామానికి చెందిన ఉగ్రంగి వెంకటరవి ప్రసాద్ తన తండ్రి సోమలింగం జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు కుర్చీలు, టేబుళ్లు, పుస్తకాలు స్వచ్ఛందంగా సమకూర్చారు. ఉద్యోగులు ఆర్థిక సహాయం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ అన్నారు. చింతపల్లిలో శనివారం తెదేపా పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. పేదవర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రెండేళ్ల పాలనలో జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బేరా సత్యనారాయణ, గాంధీ పడాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు

(c) eenadu